హైదరాబాద్‌లో గోల్డ్‌మన్ శాక్స్ విస్తరణ

నూతన సీవోఈని తెరిచిన గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ దిగ్గజం

ప్రారంభించిన రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్

యువ ప్రతిభావంతులకు మరిన్ని ఉద్యోగావకాశాలు

రాష్ట్ర ప్రభుత్వ ప్రగతిశీల విధానాలతో వెల్లువలా గ్లోబల్ కంపెనీలు

గురువారం హైదరాబాద్‌లో గోల్డ్‌మన్ శాక్స్ కొత్త సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ (సీవోఈ)ను ఆ సంస్థ సీఈవో రిచర్డ్ గ్నోడ్‌తో కలిసి ప్రారంభిస్తున్న రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కే తారక రామారావు. చిత్రంలో కంపెనీ ఉన్నతాధికారులు, సిబ్బంది

హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ): ప్రముఖ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్, సెక్యూరిటీస్ సంస్థ గోల్డ్‌మన్ శాక్స్.. హైదరాబాద్‌లో మరో అత్యాధునిక కార్యాలయాన్ని తెరిచింది. ఈ కొత్త సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ (సీవోఈ)ను గురువారం రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కే తారక రామారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో మరిన్ని గ్లోబల్ కంపెనీల వృద్ధికి గోల్డ్‌మన్ శాక్స్ విస్తరణ.. దోహదం చేయగలదన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రగతిశీల విధానాలతో గడిచిన తొమ్మిదిన్నర ఏండ్లలో ప్రపంచ శ్రేణి కంపెనీలు హైదరాబాద్ కేంద్రంగా తమ కార్యకలాపాలను ఎంతో విస్తృతం చేశాయన్న మంత్రి.. స్థానిక యువ ప్రతిభావంతులకు ప్రపంచ స్థాయిలో అవకాశాలూ లభించాయని చెప్పారు. గ్లోబల్ కంపెనీల పెట్టుబడులు, భాగస్వామ్యాలకు గోల్డ్‌మన్ శాక్స్ నూతన కార్యాలయం ఓ చక్కని వేదికగా ఉంటుందన్నారు.

2021లోనే..

2021లోనే గోల్డ్‌మన్ శాక్స్ హైదరాబాద్‌లో కార్యకలాపాలను ప్రారంభించింది. ఇప్పుడు ఈ కొత్త ఆఫీస్‌తో విస్తరణ బాట పట్టడం సంతోషంగా ఉందని కేటీఆర్ అన్నారు. బహుళజాతి సంస్థల కార్యాలయాల ఏర్పాటుకు, వాటి వ్యాపార, పారిశ్రామిక కార్యకలాపాల విస్తరణకు రాష్ట్ర పర్యావరణ వ్యవస్థ సరిగ్గా కుదురుతున్నదన్నారు. అందుకే ఐటీ, ఫార్మా, లైఫ్ సైన్సెస్‌తోపాటు ఆర్థిక సేవలు, బ్యాంకింగ్ రంగంలో సైతం తెలంగాణ రాష్ట్రం శరవేగంగా ముందుకు సాగుతున్నదని తెలిపారు. ఇందుకు గోల్డ్‌మన్ శాక్స్ నిదర్శనమని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే డిజిటల్ అక్షరాస్యత, మహిళా సాధికారతల ద్వారా సమాజాభివృద్ధిపట్ల గోల్డ్‌మన్ శాక్స్‌కున్న నిబద్ధతను అభినందించారు.

మరింత వేగంగా..

గోల్డ్‌మన్ శాక్స్ ఇంటర్నేషనల్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈవో) రిచర్డ్ గ్నోడ్ మాట్లాడుతూ.. ఇక్కడి అసాధారణ యువ ప్రతిభావంతులతో తమ సంస్థ శరవేగంగా ముందుకు సాగుతున్నదని చెప్పారు. బెంగళూరు, హైదరాబాద్ కేంద్రంగా తాము భారత్ నుంచి ప్రపంచస్థాయి కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్టు వివరించారు. కాగా, కొత్తగా ఏర్పాటుచేసిన హైదరాబాద్ కార్యాలయంతో ఇక్కడి గోల్డ్‌మన్ శాక్స్ ఉద్యోగులు మరో 1000 మంది పెరగనున్నారని తెలుస్తున్నది.

- **గోల్డ్‌మన్ శాక్స్ 2021 మార్చిలో హైదరాబాద్‌లో తమ తొలి కార్యాలయాన్ని ప్రారంభించింది.**
- **ఇంజినీరింగ్, ఫైనాన్స్, హ్యూమన్ క్యాపిటల్ మేనేజ్‌మెంట్, కన్జ్యూమర్ బిజినెస్ సర్వీసెస్‌తోపాటు క్లౌడ్ కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతిక సేవలను ఇక్కడ తీసుకొచ్చింది.**
- **ప్రస్తుతం హైదరాబాద్‌లోని గోల్డ్‌మన్ శాక్స్ విభాగంలో 1,500 మంది నిపుణులు పని చేస్తున్నారు. అందులో 75 శాతానికిపైగా కొత్తగా నియమితులైనవారే కావడం గమనార్హం.**
- **నూతన కార్యాలయాన్ని సాలార్‌పురియా సత్వ నాలెడ్జ్ సిటీలోగల 3.51 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలోని తొమ్మిది అంతస్తుల భవనంలో ఏర్పాటుచేశారు. దీనికి**

2,500 మంది నిపుణులు పనిచేసే సామర్థ్యం ఉన్నది.

- **న్యూయార్క్‌లోని సంస్థ ప్రధాన కార్యాలయం తర్వాత బెంగళూరు, హైదరాబాద్ కేంద్రంగా భారత్‌లోనే గోల్డ్‌మన్ శాక్స్ కార్యకలాపాలు పెద్ద ఎత్తున జరుగుతుండటం విశేషం.**

ఎస్బీఐ చైర్మన్ పదవీకాలం పొడిగింపు

వచ్చే ఏడాది ఆగస్టు 28దాకా దినేశ్ ఖారానే బ్యాంక్ చీఫ్



న్యూఢిల్లీ, అక్టోబర్ 5: ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) చైర్మన్ దినేశ్ కుమార్ ఖారా పదవీకాలాన్ని పొడిగించారు. ఈ మేరకు గురువారం కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీంతో వచ్చే ఏడాది ఆగస్టుదాకా ఎస్బీఐ చీఫ్‌గా దినేశ్ కొనసాగనున్నారు. నిజానికి శుక్రవారం (అక్టోబర్ 6)తోనే దినేశ్ మూడేండ్ల పదవీకాలం ముగుస్తున్నది. ఈ క్రమంలోనే మరో 10 నెలలకుపైగా కాలాన్ని పెంచారు. అయితే వచ్చే ఏడాది ఆగస్టు 28తో దినేశ్‌కు 63 ఏండ్లు నిండుతాయి. అప్పటిదాకా ఎస్బీఐ చైర్మన్‌గా ఆయనే ఉంటారని అపాయింట్‌మెంట్స్ కమిటీ ఆఫ్ ది క్యాబినెట్ (ఏసీసీ) తమ ఆదేశాల్లో పేర్కొన్నట్టు చెప్పారు. ఇదిలావుంటే ఎస్బీఐ ఎండీల్లో ఒకరైన అశ్వినీ కుమార్ తివారీ పదవీకాలాన్ని కూడా రెండేండ్లు ఏసీసీ పొడిగించినట్టు సమాచారం. వచ్చే ఏడాది జనవరి 27తో ఈయన పదవీకాలం ముగుస్తున్నది. అయితే తాజా నిర్ణయంతో 2026 జనవరి 26 వరకు బ్యాంక్ ఎండీగా కొనసాగనున్నారు.

అమ్మకందారులకు అమెజాన్ శుభవార్త

హైదరాబాద్, అక్టోబర్ 5: ప్రస్తుత పండుగ సీజన్‌లో విక్రయదారులకు శుభవార్తను అందించింది అమెజాన్. నూతన విక్రయదారులకు ఫీజు రుసుములపై 50 శాతం మినహాయింపు కల్పిస్తున్నట్టు ప్రకటించింది. ఈ ప్రత్యేక స్కీం నవంబర్ 4 వరకు అమలులో ఉండనున్నది. ఆన్‌లైన్లో తమ ఉత్పత్తులను విక్రయించుకునేందుకు రాష్ట్రంలోని చిన్న, పెద్ద ఉత్పత్తి సంస్థలకు అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తున్నట్టు, రివార్డు కింద రూ.11,500 వరకు అందుకునే అవకాశం కూడా కల్పించినట్టు అమెజాన్ ఇండియా డైరెక్టర్ అమిత్ నందా తెలిపారు. ప్రస్తుతం సంస్థకు తెలంగాణలో 50 వేల మంది చిన్న విక్రయదారులు ఉండగా, అదే దేశవ్యాప్తంగా 14 లక్షలు ఉన్నారు. ప్రస్తుత పండుగ సీజన్‌లో 81 శాతం మంది కస్టమర్లు ఆన్‌లైన్లోనే తమకు నచ్చిన ఉత్పత్తులను కొనుగోలు చేయనున్నట్టు నీల్సన్ మీడియా సర్వేలో వెల్లడించింది. మెట్రో నగరాలతోపాటు చిన్న నగరాల్లోనూ ఆన్‌లైన్ కస్టమర్లు క్రమంగా పెరుగుతున్నారని పేర్కొంది.

కాఫీ డే రూ.434 కోట్ల డిఫాల్ట్

న్యూఢిల్లీ, అక్టోబర్ 5: ఈ ఏడాది సెప్టెంబర్ త్రైమాసికంలో కాఫీ డే ఎంటర్‌ప్రైజెస్ రూ.433.91 కోట్ల రుణాల చెల్లింపుల్లో డిఫాల్ట్ అయ్యింది. అంతక్రితం జూన్ క్వార్టర్లో రుణ వాయిదాల అసలు, వడ్డీ చెల్లింపుల్లో రూ.440.25 కోట్లు డిఫాల్ట్ అయినట్టు కంపెనీ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు తెలిపింది. బ్యాంక్‌లు, ఆర్థిక సంస్థల నుంచి తీసుకున్న రుణాలు, క్యాష్ క్రెడిట్ తదితర రివాల్వింగ్ సదుపాయాల్లో రూ.183.36 కోట్ల అసలు, రూ.5.78 కోట్ల వడ్డీ సెప్టెంబర్ త్రైమాసికంలో చెల్లించలేకపోయింది. ఎన్‌సీడీలు, ఎన్‌సీఆర్‌పీఎస్‌లు తదితర డెట్ సెక్యూరిటీలకు సంబంధించి రూ.44.77 కోట్ల వడ్డీతోసహ రూ.200 కోట్ల ముఖ విలువ చెల్లింపులో డిఫాల్ట్ అయ్యింది. ఈ డిఫాల్ట్ కారణంగా రుణదాతలు 'లోన్ రీకాల్' నోటీసులు ఇచ్చారని, లీగల్ వివాదాలు తలెత్తాయని కాఫీ డే వివరించింది. కంపెనీ వ్యవస్థాపక చైర్మన్ వీజీ సిద్ధార్థ 2019 జూలైలో మృతిచెందిన దగ్గర్నుంచి కాఫీ డే ఎంటర్‌ప్రైజెస్‌కు సమస్యలు మొదలయ్యాయి. తన టెక్నాలజీ బిజినెస్ పార్క్‌ను బ్లాక్‌స్టోన్ గ్రూప్‌నకు విక్రయించడం ద్వారా 2020 మార్చిలో 13 బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు రూ.1,644 కోట్లు చెల్లించింది.

విమాన ప్రయాణికులపై ఏటీఎఫ్ పిడుగు

రూ.1,000 ఫ్యూయల్ చార్జీ విధిస్తున్న ఇండిగో

న్యూఢిల్లీ, అక్టోబర్ 5: విమాన ప్రయాణికులపై ఏటీఎఫ్ పిడుగు పడింది. అంతర్జాతీయ మార్కెట్లో ఏటీఎఫ్ ధరలు రాకెట్ వేగంతో దూసుకుపోతుండటంతో సంస్థలపై పడుతున్న భారాన్ని తగ్గించుకోవడానికి విమానయాన సంస్థలు ఇంధన చార్జ్ విధించడానికి సిద్ధమవుతున్నాయి. వీటిలో దేశీయ విమానయాన దిగ్గజం ఇండిగో ఏకంగా రూ.1,000 వరకు విధించబోతున్నట్టు ప్రకటించింది. దేశీయ, అంతర్జాతీయ రూట్లలో కిలోమీటర్ల దూరాన్ని బట్టి చార్జి వసూలు చేస్తున్నది. 500 కిలోమీటర్ల వరకు రూ.300 వసూలు చేస్తున్న సంస్థ..గరిష్ఠంగా 3,500 కిలోమీటర్లకు పైగా దూరాన్ని రూ.1,000 విధిస్తున్నది. ఈ చార్జీలు శుక్రవారం నుంచి అమలులోకి వస్తున్నాయని పేర్కొంది. సంస్థల నిర్వహణలో సగానికి పైగా ఇంధన కోసం ఖర్చు చేస్తుండటంతో ఆయా సంస్థలపై అధికభారం పడుతున్నది.

పెరిగిన విమాన ఇంధన ధర

విమాన ఇంధన ధర భారీగా పెంచుతున్నాయి ప్రభుత్వరంగ ఇంధన విక్రయ సంస్థలు. దేశ రాజధాని ఢిల్లీలో విమాన ఇంధన ధర కిలో లీటర్ ధర రూ.5,779.84 లేదా 5.1 శాతం పెంచింది ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్(ఐవోసీ). దీంతో కిలో లీటర్ ధర రూ.1,13,419.33 నుంచి రూ.1,18,199.17కి చేరుకున్నది. ఆగస్టు 1న కిలో లీటర్ ధర 8.5 శాతం(రూ.7,728.38), సెప్టెంబర్ 1న 14.1 శాతం(రూ.13,911.07) పెంచిన సంస్థలు..ఈ నెల మొదట్లో 5 శాతం వడ్డీంచాయి. ఇలా వరుసగా ధరలు పెంచడం ఇది నాలుగోసారి కావడం విశేషం.

దూరం (కిలోమీటర్లు)	ఫ్యూయల్ చార్జ్ (రూ.లో)
0-500	300
501-1000	400
1001-1500	550
1501-2500	650
2501-3500	800
3500 కంటే అధికం	1000

ఉద్గమ్‌లో 30 బ్యాంకులు

- **ఇక మరింత వేగంగా అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్ల పరిష్కారం: ఆర్బీఐ**

ముంబై, అక్టోబర్ 5: అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్స్ గేట్‌వే టు యాక్సెస్ ఇన్ఫర్మేషన్ (ఉద్గమ్) పోర్టల్‌లో 30 బ్యాంకులున్నట్టు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) గురువారం తెలియజేసింది. ఆగస్టు 17న ఈ పోర్టల్‌ను ఆర్బీఐ ప్రారంభించిన విషయం తెలిసిందే. దేశంలోని వివిధ బ్యాంకుల్లోగల అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్ల అన్వేషణ, వాటి క్లెయిముల కోసం వచ్చేవారికి ఉపయోగకరంగా దీన్ని తీర్చిదిద్దారు. అయితే పోర్టల్ ఆరంభ సమయంలో 7 బ్యాంకులే ఉండగా, ఇప్పుడు అవి 30కి చేరాయి. దీంతో మరో వారం, పది రోజుల్లో ఇంకొ కొన్ని బ్యాంకులు వస్తాయన్న విశ్వాసాన్ని ఈ సందర్భంగా ఆర్బీఐ వ్యక్తం చేసింది. కాగా, పోర్టల్‌లో ఉన్న 30 బ్యాంకుల్లోనే అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లలో దాదాపు 90 శాతం వరకు ఉండొచ్చని చెప్తున్నారు. ఈ బ్యాంకుల్లో ఎస్బీఐ, బీవోబీ, పీఎన్‌బీ, కెనరా, బీవోఐ వంటి ప్రభుత్వ రంగ బ్యాంకులుసహా సిటీ, స్టాండర్డ్ చార్టర్డ్, హెచ్‌ఎస్‌బీసీ వంటి విదేశీ బ్యాంకులు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ, యాక్సిస్ వంటి ప్రైవేట్ రంగ బ్యాంకులూ ఉన్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్, ఇండియన్ ఫైనాన్షియల్ టెక్నాలజీ అండ్ అల్లీడ్ సర్వీసెస్, బ్యాంకులు కలిసి ఈ పోర్టల్‌ను అభివృద్ధి చేశాయి. ఈ ఏడాది ఫిబ్రవరి నాటికి దాదాపు రూ.35,000 కోట్ల అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లు బ్యాంకుల నుంచి ఆర్బీఐకి బదిలీ అయ్యాయి. ఇవన్నీ పదేండ్లు, అంతకుమించి బ్యాంకుల వద్దే ఉంటున్న డిపాజిట్లు. అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లలో ఎస్బీఐకి చెందినవే అత్యధికంగా రూ.8,086 కోట్లుగా ఉన్నాయి.

జోరుగా సైబర్ బీమా

వచ్చే ఏండ్లలో 30 శాతం చొప్పున వార్షిక వృద్ధి • డెలాయిట్ రిపోర్ట్



న్యూఢిల్లీ, అక్టోబర్ 5: భారత్‌లో సైబర్ బీమా మార్కెట్ జోరుగా పెరుగుతున్నదని, వచ్చే కొద్ది ఏండ్లలో 27-30 శాతం చొప్పున వార్షిక వృద్ధి సాధిస్తుందని డెలాయిట్ అంచనా వేసింది. గత మూడేండ్లలో ఈ మార్కెట్ చక్రగతిన 30 శాతం మేర పెరిగిందని, ప్రస్తుతం భారత్‌లో సైబర్ బీమా పరిశ్రమ విలువ 5-6 కోట్ల డాలర్లకు చేరిందని డెలాయిట్ తాజా రిపోర్ట్‌లో వెల్లడించింది. 'సైబర్ ఇన్సూరెన్స్ ఇన్ ఇండియా' రిపోర్ట్ వివరాలు..

- సైబర్ క్రిమినల్స్‌కు ఐటీ, ఫార్మా, తయారీ, సప్లైచైన్, రిటైల్, ఫైనాన్స్ పరిశ్రమలు లక్ష్యాలుగా ఉన్నాయి.
- ఈ రంగాలు సైబర్ ఇన్సూరెన్స్ తీసుకోవడంలో ముందున్నాయి.
- డెలాయిట్ సర్వేలో పాల్గొన్న పలువురు చీఫ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఆఫీసర్స్ వచ్చే మూడేండ్లలో తమ డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను సంరక్షించుకునే ఆసక్తిని వెల్లడించారు.
- సర్వేలో పాల్గొన్నవారిలో మూడవ వంతు సెక్యూరిటీ ఆఫీసర్లు రూ.100 కోట్లు అంతకంటే తక్కువ సైబర్ ఇన్సూరెన్స్ కవరేజ్ తీసుకున్నారు.
- రూ.10 కోట్లకంటే తక్కువ కవరేజ్ తీసుకున్నవారు 50 శాతం ఉన్నారు.
- ఐటీ సంస్థలతో పాటు ఫైనాన్స్, బ్యాంకింగ్ కంపెనీలు ప్రధానంగా సైబర్ ఇన్సూరెన్స్‌లో పెట్టుబడి చేస్తున్నాయి.
- వినియోగ సంస్థలు ఈ బీమా కోసం తక్కువ ఖర్చు చేస్తున్నాయి.
- ప్రస్తుతం ఉన్న పాలసీలను నిలిపివేయాలని ఎవరూ కోరుకోవడం లేదు.

కేంద్రానికి భెల్ రూ.88 కోట్ల డివిడెండ్

న్యూఢిల్లీ, అక్టోబర్ 5: గడిచిన ఆర్థిక సంవత్సరానికిగాను ప్రముఖ విద్యుత్ పరికరాల తయారీ సంస్థ భెల్..కేంద్ర ప్రభుత్వానికి రూ.88 కోట్ల డివిడెండ్‌ను చెల్లించింది. ఇందుకు సంబంధించి ప్రత్యేక చెక్కును కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి మహేంద్ర నాథ్ పాండేకు భెల్ సీఎండీ నలిన్ సింఘాల్ గురువారం అందచేశారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికిగాను సంస్థ రూ.139 కోట్ల తుది డివిడెండ్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. దీంట్లో 63.17 శాతం వాటా కలిగిన కేంద్రానికి రూ.88 కోట్ల డివిడెండ్‌ను అందచేసింది.

సిట్రాయిన్ నుంచి నయా ఎస్‌యూవీ

ప్రారంభ ధర రూ.9.99 లక్షలు

చెన్నై, అక్టోబర్ 5: ఫ్రెంచ్‌కు చెందిన కార్ల తయారీ సంస్థ సిట్రాయిన్..దేశీయ మార్కెట్లోకి సరికొత్త ఎస్‌యూవీ సీ3 ఎయిర్‌క్రాస్ మాడల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. రూ.9.99 లక్షల ప్రారంభ ధరలో ఈ మాడల్ లభించనున్నది. ఈ ధరలు ఢిల్లీ షోరూంనకు సంబంధించినవి. 90 శాతం ప్రాంతీయ విడిభాగాలతో దేశీయ అవసరాలకు తగ్గట్టుగా ఈ మాడల్‌ను తీర్చిదిద్దినట్టు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. ఐదుగురు, ఏడుగురు కూర్చోవడానికి వీలుండే విధంగా డిజైన్ చేసింది. వీటిలో ఐదు సీట్లు కలిగిన మాడల్ రూ.9.99 లక్షల నుంచి రూ.11.99 లక్షల లోపు, 5+2 సీట్ల కెపాసిటీ కలిగిన మాడల్ రూ.35 వేలు అదనంగా అంటే రూ.12.34 లక్షలుగా నిర్ణయించింది. ఈ ఏడాది చివరి నుంచి బుకింగ్ చేసుకున్న కస్టమర్లకు అందచేయనున్నట్టు తెలిపింది. ఈ కారుపై రెండేండ్లు లేదా 40 వేల కిలోమీటర్ల వ్యారెంటీ సదుపాయం కల్పిస్తున్నది.

లాభాల్లోకి స్టాక్ మార్కెట్లు

సెన్సెక్స్ 405, నిఫ్టీ 108 పాయింట్లు పెరుగుదల

ముంబై, అక్టోబర్ 5: దేశీయ స్టాక్ మార్కెట్లు తిరిగి లాభాల్లోకి వచ్చాయి. అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు తగ్గుముఖం పట్టడంతోపాటు క్యాపిటల్ గూడ్స్, బ్యాంకింగ్, ఐటీ రంగ షేర్లకు మదుపరుల నుంచి లభించిన మద్దతుతో సూచీలు వరుస నష్టాలకు తెరతీసినట్టు అయింది. దేశీయ తయారీ రంగ డాటా కూడా అంచనాలకు మించి నమోదుకావడం, పరపతి సమీక్షలో రిజర్వుబ్యాంక్ వడ్డీరేట్లను యథాతథంగా ఉంచే అవకాశాలున్నట్టు వచ్చిన సంకేతాలు మదుపరులను కొనుగోళ్ల వైపు నడిపించాయి. ఇంట్రాడేలో 500 పాయింట్లకు పైగా లాభపడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 405 పాయింట్లు లాభపడి 65,631.57 వద్ద ముగిసింది. 65,598 వద్ద ప్రారంభమైన సూచీ ఒక దశలో 65,753 పాయింట్ల గరిష్ఠ స్థాయిని తాకింది. ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 109.65 పాయింట్లు అందుకొని 19,545.75 వద్ద స్థిరపడింది. గత కొన్ని రోజులుగా భారీగా నిధులను ఉపసంహరించుకున్న విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారీగా నిధులను కుమ్మరించడం సూచీలు పుంజుకోవడానికి దోహదపడ్డాయి. క్రూడాయిల్ ధరలు తగ్గుముఖం పట్టడం, తయారీ రంగ డాటా ఆశాజనకంగా ఉండటంతో మార్కెట్లో సెంటిమెంట్‌ను బలపరిచిందని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు.

- లార్సెన్ అండ్ టుబ్రో 2.35 శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది. దీంతో పాటు టైటాన్, టీసీఎస్, మహీంద్రా, ఇన్ఫోసిస్, ఏషియన్ పెయింట్స్, ఐసీఐసీఐ బ్యాంక్, ఎస్బీఐలు ఒక్క శాతంకు పైగా షేరు పెరిగింది
- అలాగే టాటా మోటర్స్, యాక్సిస్ బ్యాంక్, మారుతి, కొటక్ బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్, హెచ్‌యూఎల్, విప్రో, భారతీ ఎయిర్‌టెల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టెక్ మహీంద్రా, ఐటీసీలు లాభాల్లో ముగిశాయి.
- కానీ, పవర్‌గ్రిడ్, ఎన్‌టీపీసీ, నెస్లె, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, సన్‌ఫార్మా, టాటా స్టీల్, రిలయన్స్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ నష్టపోయాయి.
- బీఎస్‌ఈ స్మాల్‌క్యాప్ ఇండెక్స్ బలపడగా..మిడ్‌క్యాప్ ఇండెక్స్ నష్టపోయింది.
- రంగాలవారీగా చూస్తే క్యాపిటల్ గూడ్స్ 1.31 శాతం, సర్వీసెస్ 1.03 శాతం, ఐటీ, ఇండస్ట్రీయల్స్, టెక్, వాహన రంగ షేర్లు లాభాల్లో ముగిశాయి.
- కానీ, ఎఫ్‌ఎంసీజీ, టెలి కమ్యూనికేషన్, యుటిలిటీ, మెటల్ రంగ షేర్లు నష్టపోయాయి.

జావా ప్రీమియం బైకులు

హైదరాబాద్, అక్టోబర్ 5: ప్రస్తుత పండుగ సీజన్‌ను దృష్టిలో పెట్టుకొని నూతన ప్రీమియం మోటార్‌సైకిల్‌ను దేశీయ మార్కెట్లోకి విడుదల చేసింది జావా యజ్డీ. రెండు రకాల్లో లభించనున్న జావా 42, యజ్డీ రోడ్‌స్టర్ ధరలు వరుసగా రూ.1.98 లక్షలు, రూ.2.08 లక్షలుగా నిర్ణయించింది. 294.7 సీసీ సింగిల్ సిలిండర్ ఇంజిన్ కలిగిన ఈ బైకులో ఆరు స్పీడ్ గేర్లు, డ్యూయల్ చానెల్-ఏబీఎస్ వంటి ఫీచర్లు ఉన్నాయని జావా యజ్డీ మోటర్‌సైకిల్ సీఈవో ఆశిష్ సింగ్ జోషి తెలిపారు.

తగ్గనున్న పాదరక్షల పరిశ్రమ వృద్ధి

న్యూఢిల్లీ, అక్టోబర్ 5: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దేశీయ పాదరక్షల పరిశ్రమ వృద్ధి రేటు గణనీయంగా తగ్గుతుందని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా అంచనా వేసింది. 2022-23లో 28 శాతం వృద్ధిచెందిన ఈ పరిశ్రమ పెరుగుదల 2023-24లో 7-8 శాతానికి పరిమితమవుతుందన్నది. అమ్మకాల వృద్ధి తగ్గడం, సగటు అమ్మకపు ధరల్లో పెరుగుదల లేకపోవడంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రథమార్థంలో పరిశ్రమ ఆదాయ వృద్ధి అంతంతమాత్రంగానే ఉన్నదని ఇక్రా తెలిపింది. మాస్ విభాగంలో అమ్మకాలు తగ్గాయని, సమీప కాలంలో డిమాండ్ గణనీయంగా మెరుగుపడే అవకాశం లేదని చెపుతూ ద్వితీయార్థంలో పండుగ, పెండ్లిళ్ల సీజన్ కారణంగా అమ్మకాలు కొంత కోలుకోవచ్చని అంచనా వేసింది. ప్రీమియం విభాగంపై దృష్టిపెట్టిన కంపెనీలు మెరుగైన పనితీరు కనపరుస్తాయని ఇక్రా పేర్కొంది. ప్రథమార్థంలో ముడి ఉత్పత్తుల ధరలు తగ్గినందున కంపెనీల ఆపరేటింగ్ లాభాల మార్జిన్ స్థిరంగా ఉన్నదని, 2023 ఆగస్టు నుంచి ముడి ఉత్పత్తుల ధరలు పెరుగుతున్నందున, ద్వితీయార్థంలో మార్జిన్లపై ప్రతికూల ప్రభావం పడుతుందని రేటింగ్ ఏజెన్సీ వివరించింది. మొత్తం మీద 2023-24లో ఆపరేటింగ్ మార్జిన్లు 18.5 శాతం వద్ద ఉంటాయని ఇక్రా అంచనా వేసింది.

50 వేల దిగువకు బంగారం!

ప్రస్తుత ట్రెండ్ నేపథ్యంలో అంచనాలు • క్రమేణా పడిపోతున్న ధరలు

ఇప్పటికే రూ.53 వేల వద్దకు 22 క్యారెట్ పసిడి • నిపుణులు ఏమంటున్నారు?

న్యూఢిల్లీ/హైదరాబాద్, అక్టోబర్ 5: బంగారం ధరలు క్రమేణా తగ్గుముఖం పడుతున్నాయి. గడిచిన 10 రోజుల్లోనే దేశీయ మార్కెట్‌లో తులం విలువ రూ.2,500లకు పైగా పడిపోవడం గమనార్హం. ఈ నేపథ్యంలో గోల్డ్ రేట్లు మరింతగా దిగజారుతాయన్న అంచనాలు వినిపిస్తున్నాయిప్పుడు. గత నెల సెప్టెంబర్‌లో 22 క్యారెట్ (ఆభరణాల బంగారం) 10 గ్రాముల పుత్తడి రూ.55,000 పలికింది. ప్రస్తుతం రూ.53,000 దరిదాపుల్లో కదలాడుతున్నది. దీంతో ముున్ముందు రూ.50,000 దిగువకు రావచ్చన్న అంచనాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

ఇంకా పడిపోతుందా..

పసిడి ధరలకు సంబంధించి మార్కెట్ ఊహాగానాలపై నిపుణులు చెప్తున్నదానికొస్తే.. ప్రస్తుత స్థాయితో పోల్చితే ధరలు మరింత పడిపోయే వీలుందనే అంటున్నారు. అయితే రూ.51,000 దిగువకు రాకపోవచ్చని అభిప్రాయపడుతున్నారు. దీన్నిబట్టి తులం ధర ఇంకో రూ.1,000-1,500 క్షీణించేందుకు ఆస్కారముందన్న సంకేతాలైతే మార్కెట్ ఎక్స్‌పర్ట్స్ నుంచి వస్తున్నాయి. కానీ రూ.50,000, అంతకంటే తక్కువ స్థాయికి ధరలు వెళ్లకపోవచ్చనే చెప్తున్నారు.

ఎందుకీ పతనం?

బంగారం రేట్లలో ప్రస్తుతం కనిపిస్తున్న తగ్గుదలకు సాంకేతిక కారణాలున్నాయని నిపుణులు పేర్కొంటున్నారు. ప్రధానంగా డాలర్ ఇండెక్స్ పెరగడం వల్లే ఇదంతా అని చెప్తున్నారు. అమెరికా డాలర్ రేట్లు గతకొద్ది రోజులుగా అంతకంతకూ పెరుగుతూపోతున్నాయని, పసిడి ధరల్ని ఇది ప్రభావితం చేస్తున్నదని వివరిస్తున్నారు.

డాలర్ రేటు ఇంకా పెరిగితే పుత్తడి ధర మరింత ఒత్తిడికి లోనవుతుందని చెప్తున్నారు. దాంతో అటు అంతర్జాతీయ మార్కెట్‌లో, ఇటు దేశీయ మార్కెట్‌లో గోల్డ్ రేట్లు పతనమవుతాయని విశ్లేషిస్తున్నారు. ఒకవేళ డాలర్ ఇండెక్స్ తగ్గితే.. బంగారం ధరలు తిరిగి పుంజుకోవడం మొదలవుతుందని పేర్కొంటున్నారు. ఇప్పటికే చాలారోజుల నుంచి డాలర్ ఇండెక్స్ రైజ్‌తో ధరలు తగ్గుముఖం పడుతున్నందున, కరెక్షన్‌కు అవకాశాలున్నాయని, ఇదే జరిగితే బంగారం ధరలు పరుగందుకుంటాయని చెప్తున్నారు.

పెట్టుబడులకు అనుకూలం

ప్రస్తుత పరిస్థితుల్లో గోల్డ్ సావరిన్ బాండ్లలో పెట్టుబడులకు మంచి అవకాశాలున్నాయని, ఆకర్షణీయమైన లాభాలు పొందవచ్చని ఆర్థికవేత్త త్రినాథ్ లెంక చెప్తున్నారు. ధరలు ఇప్పుడు తగ్గుముఖం పడుతున్నా.. మళ్లీ పెరిగే వీలుందని, కాబట్టి గోల్డ్ ఇన్వెస్ట్‌మెంట్స్ సురక్షితమేనన్న అభిప్రాయాన్ని మరికొంత మంది ఆర్థికవేత్తలు సైతం వ్యక్తం చేస్తున్నారు. నిజానికి అంచనాలకు మించి పుత్తడి ధరలు పడిపోతున్నాయని, కనుక ఈ పతనానికి త్వరలోనే బ్రేక్ పడటం ఖాయమన్న విశ్వాసాన్నీ వారు వెలిబుచ్చుతున్నారు.

దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం ధరలు (రూ.లలో)

నగరం	22 క్యారెట్	24 క్యారెట్
హైదరాబాద్	52,400	57,160
ఢిల్లీ	52,550	57,310
ముంబై	52,400	57,160
బెంగళూరు	52,400	57,160
చెన్నై	52,950	57,760
కోల్‌కతా	52,400	57,160

అమ్మకాలు పుంజుకోవచ్చు..

పండుగ సీజన్, రాబోతున్న పెండ్లిళ్ల సీజన్‌తో బంగారం అమ్మకాలు తిరిగి పుంజుకుంటాయన్న ఆశాభావాన్ని నగల వ్యాపారులు కనబరుస్తున్నారు. ధరలు తగ్గినందున కొనుగోలుదారులు గతంతో పోల్చితే ఎక్కువగా ఈసారి కొనవచ్చన్న అభిప్రాయాలనూ వారు వ్యక్తపరుస్తున్నారు. ఈ క్రమంలో వచ్చే దసరా, దీపావళి, ధనత్రయోదశి వేడుకల్లో గిరాకీ బాగానే ఉంటుందని అంచనా వేస్తున్నారు.